
సాక్షి
అనంతపురం
శనివారం । 16 । డిసెంబర్ । 2023



23 నుంచి హనుమద్ వ్రతాలు

కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 23 నుంచి హనుమద్ వ్రత ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 8లో



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
32.1°/15.3°

జిల్లా అంతటా ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉదయం చలి తీవ్రత పెరిగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

రేపు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఆదివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు జెడ్పీ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. స్థాయీ సంఘం–1, 2, 4, 7 (ఆర్థిక, ప్రణాళిక/గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్యం/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలు ప్రధాన సమావేశ భవన్‌లో ఉదయం 10 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన ప్రారంభం కానున్నాయి. స్థాయీ సంఘం–3, 5, 6 (వ్యవసాయం/ఐసీడీఎస్/సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలు అదనపు సమావేశ భవన్‌లో ఆయా స్థాయీసంఘాల చైర్మన్ల అధ్యక్షతన నిర్వహించనున్నారు. గత సమావేశాల్లో సభ్యులు చర్చించిన అంశాలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యల గురించి సమగ్ర వివరాలతో అధికారులు సమావేశాలకు హాజరు కావాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల్లో పలువురికి చోటు



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ కమిటీల్లో పలువురికి చోటు దక్కింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

బీసీ సెల్ రాష్ట్ర విభాగం: బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్‌గా రమేష్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శిగా కె.ధనుంజయ యాదవ్, సహాయ కార్యదర్శులుగా దొగురు వెంకటకుమార్, జయప్రకాష్ గౌడ్, ఎస్.రామలింగప్ప.

మైనార్టీ సెల్ రాష్ట్ర విభాగం: అధికార ప్రతినిధిగా షేక్ ఖాజా పీరా, ప్రధాన కార్యదర్శిగా షేక్ నియాజ్, కార్యదర్శిగా జీఎం బాషా, సహాయ కార్యదర్శులుగా షేక్ మునీర, పటాన్ గఫార్ ఖాన్.

రాష్ట్ర రైతు విభాగం: జోనల్ ఇన్‌చార్జ్‌గా బోయ నరేంద్రబాబు (రాజారాం), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గౌని ఉపేంద్రరెడ్డి, కార్యదర్శిగా టీసీ నారాయణరెడ్డి.

రాష్ట్ర వాణిజ్య విభాగం: కార్యదర్శిగా గూడూరు మల్లికార్జున, సహాయ కార్యదర్శిగా కేపీ రత్నయ్య.

రాష్ట్ర చేనేత(వీవర్స్) విభాగం: సహాయ కార్యదర్శులుగా పిరిమి తిప్పేస్వామి, కందె శివ, నీల శ్రీనివాసులు.

సరుకులు తీసుకోని కార్డుదారులకు రేపు పంపిణీ



అనంతపురం అర్బన్: ఏదేని కారణం చేత ఈ నెల నిత్యావసర సరుకులు తీసుకోని కార్డుదారులకు ఆదివారం ప్రత్యేకంగా పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ శుక్రవారం తెలియజేశారు. ఇంటింటి రేషన్ పంపిణీలో భాగంగా జిల్లాలో శుక్రవారం వరకు కార్డుదారులకు ఎండీయూ వాహనాల ద్వారా సరుకులు పంపిణీ చేశారన్నారు. అయితే ఎవరైనా కార్డుదారులు సరుకులు తీసుకోకపోయి ఉంటే... అలాంటి వారి కోసం పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 17న సచివాలయం వద్ద ఎండీయూ వాహనం ద్వారా సరుకులు పంపిణీ చేస్తారన్నారు. కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆయనుంటే కరువే

- గత ప్రభుత్వంలో ఐదేళ్లూ దుర్భిక్ష పరిస్థితులే
- ఏటా 31 మండలాలు కరువు ప్రాంతాలుగా ప్రకటన
- సాగునీరు అటుంచితే తాగునీటికీ కటకటలాడిన ప్రజలు
- జిల్లాలోని చెరువులన్నీ బీళ్లను తలదన్నేలా కనిపించాయి
- 2019 తర్వాత నాలుగేళ్లు సమృద్ధిగా వర్షాలు..పెరిగిన భూగర్భ జలాలు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాజు మంచివారైతే రాజ్యం సుభిక్షంగా ఉంటుంది. ప్రజలందరూ సుఖశాంతులతో ఉంటారని నానుడి. కానీ చంద్రబాబు హయాంలో కరువు విలయ తాండవం చేసింది. చంద్రబాబు..కరువు కవల పిల్లలు అనడం ఆనవాయితీ అయింది. ముఖ్యంగా అనంతపురం లాంటి వర్షాధార పంటలు పండే జిల్లాకు చంద్రబాబు పాలనా కాలం తీవ్ర దుర్భిక్షంగా మారింది. వర్షాలు లేక పల్లెలకు పల్లెలే కర్ణాటక ప్రాంతానికి వలసలు వెళ్లేవి. ఈయన పాలన వద్దురా అనే విధంగా ఉండేది. దీనికి గతంలో ఎప్పుడో కాదు 2014–19 మధ్య పాలనా కాలం కూడా ఒక ప్రత్యక్ష సాక్షిగా నిలిచింది.

నాడు ఏటా కరువు తాండవమే

ఆంధ్రప్రదేశ్ రెండు ముక్కలుగా విడిపోయింది. అసలే ఆర్థిక పరిస్థితులు బాగలేవు. కనీసం ప్రకృతి అయినా సహకరిస్తుందేమోనని ఉమ్మడి అనంతపురం జిల్లా వాసులు ఆశించారు. కానీ 2014 నుంచి 2019 మధ్య ఐదేళ్లూ కరువు దరువేసింది. ప్రతి ఏటా 31 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాల్సి వచ్చింది. రాష్ట్రంలోనే అత్యల్ప వర్షపాతం నమోదైంది. పశువులకు గ్రాసమూ లభించలేదు. ఏటా కరువు నెలకొనడంతో ప్రజలు అష్టకష్టాలు పడ్డారు.

బీళ్లను తలపించిన చెరువులు

తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న చెరువులు బీళ్లను తలపించాయి. 1,263 చెరువులు ఉంటే ఐదేళ్లలో ఏనాడూ నిండిన దాఖలాలు లేవు. ఓ వైపు కరెంటు సరిగా ఇవ్వకపోవడం, బోర్లలో నీళ్లు లేకపోవడం వెరసి రైతన్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా దిగిపోయారో లేదో కరువు సీమగా ఉన్న అనంతపురం జిల్లా జలకళతో పులకించి పోయింది.

2019 తర్వాత వర్షాలే వర్షాలు

2019 మే 30న ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఆ ఏడాది నుంచి వరుసగా నాలుగేళ్లు అనంతపురం చరిత్రలో ఎప్పుడూ లేనంతగా వర్షాలు కురిశాయి. చెరువులన్నీ జలకళ సంతరించుకున్నాయి. గతంలో 700 అడుగులు బోర్లు వేస్తేగానీ పడని నీళ్లు 2019 తర్వాత 200 అడుగులు వేస్తే చాలు అసాధారణ రీతిలో నీళ్లు పడ్డాయి. భూగర్భ జలాలు కనీవినీ ఎరుగని రీతిలో పైకి వచ్చాయి. నాలుగేళ్లు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక్కటంటే ఒక్క మండలం కూడా కరువు జాబితాలో లేదు. ఈ ఏడాది మాత్రం వర్షాభావ పరిస్థితులతో 28 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్ భారీగా అందించింది.

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కరువు మండలాలు

సంవత్సరం	కరువు మండలాలు
2014-15	31
2015-16	31
2016-17	31
2017-18	31
2018-19	31



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కరువు మండలాలు

సంవత్సరం	కరువు మండలాలు
2019-20	00
2020-21	00
2021-22	00
2022-23	00
2023-24	28



చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని, ఆయన త్యాగఫలమే ఆంధ్రరాష్ట్ర అవతరణ అని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమానికి జేసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పొట్టి శ్రీరాములు చిత్రటానికి ఆయన పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. జేసీ మాట్లాడుతూ ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ద్వారానే న్యాయం జరుగుతుందని పొట్టి శ్రీరాములు భావించి 1952 అక్టోబరు 19న మద్రాసులో నిరాహార దీక్ష చేపట్టి డిసెంబరు 15న ప్రాణాలు అర్పించి అమరజీవి అయ్యారన్నారు. ఆ త్యాగఫలం కారణంగానే ఆంధ్రరాష్ట్రం ఏర్పాటయ్యిందన్నారు. అమరజీవి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయమన్నారు. ఆయన చూపిన బాటలో అందరూ నడవాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్‌రావు, జిల్లా టూరిజం అధికారి నాగేశ్వరరెడ్డి, సంక్షేమ శాఖల అధికారులు అన్నాదొర, కుష్బూ కొఠారి, వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, డీఎస్ఓ శోభారాణి, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ అభినందనీయం

కూడేరు: కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేయడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వేణుగోపాల్ (కూడేరు పీహెచ్‌సీ ఎల్‌టీ) అన్నారు. శుక్రవారం ఆయన కూడేరులో విలేకరులతో మాట్లాడారు. 2014 జూన్ 2 నాటికి నియమించబడిన, కొనసాగుతున్న అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తుండటం హర్షణీయమన్నారు.

క్రైస్తవులంతా జగన్ వెంటే



ప్రీ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, పైలా నరసింహయ్య తదితరులు

- జగనన్నను మళ్లీ సీఎంను చేసుకుందాం
- పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధుల పిలుపు
- రాచానపల్లిలో ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు
- జగన్ పాలనలో మైనార్టీలకు పూర్తి రక్షణ
- విప్ కాపు, ఎమ్మెల్యేలు అనంత, తోపుదుర్తి, మాజీ ఎమ్మెల్యే విశ్వ

రాప్తాడు రూరల్: మైనార్టీల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే క్రైస్తవులంతా ఉన్నారని పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. మళ్లీ ఆయన్ను ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి సమీపంలోని ఏసు కృపా మందిరంలో శుక్రవారం జిల్లా పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నెహెమ్యా రెడ్డివారి నాగరాజు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ముందుగా పాస్టర్ నవీన్ కుమార్ ప్రార్థనతో ప్రారంభించగా పాస్టర్ లీనా డెబోరో ఆరాధన చేశారు. ముఖ్య ప్రసంగీకులుగా డాక్టర్ కేపీ రఘునాథ్ డానియేల్ వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమాదేవి, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్, పార్టీ సీనియర్ నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, పామిడి వీరాంజనేయులు, జనార్దన్ రెడ్డి, ధనుంజయ యాదవ్ తదితరులు హాజరయ్యారు. కాపు రామచంద్రారెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, పైలా నరసింహయ్య మాట్లాడుతూ ఏసుప్రభు ప్రపంచానికి గొప్ప శాంతి సందేశం ఇచ్చారన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలమూ మైనార్టీలకు పూర్తి రక్షణ ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం క్రిస్మస్‌కు రెండు వారాల ముందు క్రైస్తవులు ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకుంటారన్నారు. ఈ సందర్భంగా దాదాపు 200 మంది పాస్టర్లకు నిత్యావసర సరుకులతో పాటు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం అసోసియేషన్ తరఫున 200 మంది పాస్టర్లకు ఒక్కొక్కరికి రూ.2 వేల నగదును అందజేశారు. చివరగా క్రిస్మస్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు బందెల రాజు, కె.పరిశుద్ధ రావు, బెన్‌హర్ బాబు, పీటీసీ సునీల్ కుమార్, ఉపాధ్యక్షులు. పాస్టర్ పి.మార్క్, కార్యదర్శి పాస్టర్ జీఆర్ ఆనంద్, జాయింట్ కార్యదర్శి మనష్షే, ట్రెజరర్ కె.జీవన్ బాబు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో ముద్దాయికి యావజ్జీవం

అనంతపురం క్రైం: చిన్నారిపై అత్యాచారం చేసిన కేసులో ముద్దాయి గాజుల ప్రభాకర్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ అనంతపురం స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి శుక్రవారం తీర్పు వెలువరించారు. వివరాలిలా ఉన్నాయి. 2020 మార్చి 25న గుమ్మఘట్ట మండలంలోని ఒక గ్రామంలో ఆరేళ్ల చిన్నారిపై గాజుల ప్రభాకర్ అత్యాచారం చేశాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గుమ్మఘట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి కళ్యాణదుర్గం డీఎస్పీ ఎం.వెంకటరమణ దర్యాప్తు చేపట్టారు. అనంతరం పోక్సో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు అన్ని కోణాల్లోనూ సమగ్ర విచారణ జరిపింది. గాజుల ప్రభాకర్ నేరం చేసినట్టు నిరూపితం కావడంతో స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి శుక్రవారం యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. రూ.5 వేల జరిమానాతో పాటు బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని అందులో పేర్కొన్నారు. అప్పటి డీఎస్పీ ఎం.వెంకటరమణ, స్పెషల్ పీపీ విద్యాపతి, కీలక కేసులో ముద్దాయికి సరైన శిక్ష పడేలా కోర్టుకు వెళ్లి సాక్షులను ప్రవేశ పెట్టడం, సరైన పర్యవేక్షణ చేసిన ప్రస్తుత కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు, రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్, గుమ్మఘట్ట ఎస్ఐ సునీత, కోర్టు కానిస్టేబుల్ నాగార్జునను ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

ఉమ్మడి జిల్లాలో మోస్తరు వర్షాలు

బుక్కరాయసముద్రం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కదిరి, హిందూపురం, పెనుకొండ, మడకశిర, ధర్మవరం, తాడిపత్రి డివిజన్లలో రానున్న 18, 19, 20 తేదీల్లో చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ మేరకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవ రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటన విడుల చేశారు.

గొల్లపల్లిలో ఘోరం

- ముగ్గురు పిల్లలు సహా తండ్రి ఆత్మహత్యా యత్నం



చికిత్స పొందుతున్న గంగాధర, కుమార్తెలు గంగోత్రి, కావేరి, కీర్తి

రాయదుర్గం: బంధువుల్లో ఒకరి వివాహేతర సంబంధానికి తమను బాధ్యులను చేస్తూ దెప్పిపొడుస్తుండటాన్ని భరించలేకపోయిన ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెందాడు. చావే శరణ్యమనుకున్నాడు. తను పోయాక పిల్లలు అనాథలవుతారని భావించాడు. చివరకు ముగ్గురు కూతుళ్లకు విషం తాపి.. ఆపై తానూ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. రాయదుర్గం పట్టణ శివారులో ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... శెట్టూరు మండం గొల్లపల్లికి చెందిన వడ్డే గంగాధరకు గుమ్మఘట్ట మండలం పూలకుంటకు చెందిన వడ్డే గీతతో వివాహమైంది. వీరికి ఎనిమిదేళ్ల వయసున్న గంగోత్రి, ఆరేళ్ల వయసున్న కావేరి, రెండేళ్ల వయసున్న కీర్తి సంతానం. గొల్లపల్లిలోనే భార్యతో కలిసి కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పెద్దకుమార్తె గంగోత్రిని చదువుకునేందుకు పూలకుంటలో అమ్మమ్మ, తాతయ్యల వద్దకు పంపించాడు. ఇదిలా ఉండగా.. భార్య తరఫు బంధువుల్లోని ఒక వివాహితకు గొల్లపల్లిలోని వ్యక్తితో వివాహేతర సంబంధం ఉంది. విషయం బయటపడిన తర్వాత వివాహిత కుటుంబంలో చిచ్చు రేగి కాపురం కూలింది. ఇందుకు గంగాధర్‌ను బాధ్యుడిని చేస్తూ భార్య తరఫు బంధువుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. దెప్పిపొడుపు మాటలు భరించలేకపోయిన గంగాధర ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. కూతుళ్లు అనాథలు కాకూడదని భావించి వారిని చంపి.. తర్వాత తానూ చావాలనుకున్నాడు. శుక్రవారం భార్య కూలి పనికి వెళ్లగానే.. తన వద్ద ఉంటున్న ఇద్దరు కూతుళ్లను 'అమ్మమ్మ ఊరికెళ్దాం' అని చెప్పి ద్విచక్ర వాహనంపై బయల్దేరి పూలకుంట ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న పెద్ద కుమార్తె వద్దకు వెళ్లాడు. అటు నుంచి ముగ్గురు కుమార్తెలతో కలిసి రాయదుర్గం పట్టణ శివారులోని రస సిద్దుల కొండ వద్దకు చేరుకున్నాడు. అప్పటికే పురుగుమందు కలిపిన కూల్‌డ్రింక్‌ను కూతుళ్లకు తాపించి, తనూ తాగాడు. చిన్నమ్మాయి కీర్తి కడుపులో మంట అంటూ విలవిలలాడుతుండటంతో చూడలేక అందరినీ తీసుకుని బైక్‌పై రాయదుర్గం ఆస్పత్రికి తీసుకొచ్చి చేర్చాడు. వైద్యులకు విషయం తెలియజేశాడు. వెంటనే వైద్యులు చికిత్స ప్రారంభించారు. అయితే చిన్నారి కీర్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తేల్చారు. మిగిలిన వారిలోనూ మోతాదుకంటే ఎక్కువగా పురుగుమందు ఉన్నట్లు నిర్ధారించారు. మెరుగైన వైద్యం కోసం నలుగురినీ అనంతపురం సర్వజన ఆస్పత్రికి పంపించారు. ఆస్పత్రి వద్దకు చేరుకున్న గీతా పిల్లలను చూసి బోరున విలపించింది. ఎంతపనిచేశావయ్యా అంటూరోదించింది. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రమణ తెలిపారు.

పంటల పరిస్థితి అంచనా వేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్, చిత్రంలో ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత

అనంతపురం అర్బన్: వర్షాభావం నెలకొన్న నేపథ్యంలో జిల్లాలో సాగు చేస్తున్న పంటల పరిస్థితిని అంచనా వేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జాయింట్ కలెక్టర్‌తో పాటు ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈసారి సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యిందన్నారు. స్థానిక పరిస్థితులు, వర్షాభావం, తదితర అంశాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు వివరించాలన్నారు. తక్కువ నీరు అవసరమయ్యే పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు. ఇదే క్రమంలో రబీకి సంబంధించి ఈ–క్రాప్ బుకింగ్ చేపట్టాలన్నారు. ఎరువులను జాగ్రత్తగా సరఫరా చేయాలని సూచించారు. పాత స్టాక్‌కు కొత్త ధరలు కాకుండా పాత ధరలే వసూలు చేయాలని ఆదేశించారు. కరువు పరిస్థితుల దృష్ట్యా ఉపాధి హామీ పథకం కింద కూలీల సంఖ్యను మరింత పెంచాలన్నారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం కింద రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, సలహా మండలి సభ్యులు ఆలమూరు సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి, సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రమణ్యం, ఉద్యాన శాఖ డీడీ రఘునాథ్‌రెడ్డి, మత్స్య శాఖ అధికారి ఆంజనేయులు, ఏఆర్ఎస్ శాస్త్రవేత్త సహదేవరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్కేయూ డిగ్రీ ఫలితాలు విడుదల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఈ ఏడాది జూలైలో నిర్వహించిన రెగ్యులర్ బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ రెండు, నాల్గో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. నాలుగో సెమిస్టర్‌కు సంబంధించి మొత్తం 12,120 మంది పరీక్షలు రాయగా 5,114 మంది ఉత్తీర్ణులై 42.19 శాతం పురోగతి సాధించారు. రెండో సెమిస్టర్‌లో మొత్తం 7,426 మంది పరీక్షలకు హాజరు కాగా 3,481 మంది పాసయ్యారు. 46.88 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలు ఈ నెల 16 నుంచి జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయని పరీక్షల విభాగం అధికారులు ప్రకటించారు. రీవాల్యుయేషన్/ పర్సనల్ వెరిఫికేషన్ కోసం ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రీవాల్యుయేషన్/ వ్యక్తిగత వెరిఫికేషన్ కోసం పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు.

సెమిస్టర్లు, కోర్సుల వారీగా ఫలితాలు

కోర్సు	రాసిన వారు	పాసైన వారు	శాతం
రెండో సెమిస్టర్			
బీఏ	469	137	29.21
బీబీఏ	589	298	50.59
బీసీఏ	60	43	71.67
బీకాం	4,272	1,835	42.95
బీఎస్సీ	2,036	1,168	57.37
నాలుగో సెమిస్టర్			
బీఏ	1,084	378	34.87
బీబీఏ	981	379	38.63
బీసీఏ	29	11	37.93
బీకాం	5,157	2,162	41.92
బీఎస్సీ	4,869	2,184	44.86

క్లుప్తంగా

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం పొట్టి శ్రీరాములు వర్థంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు ఆంధ్రప్రదేశ్ కు చేసిన సేవలు, ప్రాణత్యాగం గురించి కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విజయ భాస్కర్‌రెడ్డి, డీసీఆర్బీ సీఐ విశ్వనాథచౌదరి, జిల్లా పోలీసు కార్యాలయం ఏఓ శంకర్, ఆర్ఎస్ఐ రమేష్ నాయక్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్ పాల్, ఎస్పీ సీసీ ఆంజనేయ ప్రసాద్, ఐటీ కోర్ టీం మంజు పాల్గొన్నారు.

పరికరాల నాణ్యతలో రాజీ పడేదిలేదు



డ్రిప్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమైన ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్

అనంతపురం అగ్రికల్చర్: డ్రిప్ పరికరాల నాణ్యతలో రాజీపడేది లేదని ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో డ్రిప్ కంపెనీల ప్రతినిధులు, ఎంఐ ఇంజనీర్లతో పీడీ సమావేశం నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా పరికరాలు మంజూరు చేసినా, రైతుల నుంచి నగదు రూపంలో తీసుకున్నా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ యేడాది 12,500 హెక్టార్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకూ 8,072 మంది రైతులకు 9,885 హెక్టార్లకు మంజూరు చేశామన్నారు. ఇందులో 90 శాతం మందికి మెటీరియల్ సరఫరా చేశామని తెలిపారు. ఓ వైపు మంజూరు, సరఫరా, మరోవైపు పొలాల్లో బిగించే కార్యక్రమం వేగవంతం చేశామని తెలిపారు. జనవరి నెలాఖరుకే వందశాతం డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

స్వచ్ఛత వైపు అడుగులు

- జగనన్న స్వచ్ఛ సంకల్పంతో గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం
- పారిశుధ్యం, ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి
- చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో సత్ఫలితాలు

జిల్లాలో ఉన్న పంచాయతీలు	575
చెత్త సంపద తయారీ కేంద్రాలు	518
వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న కేంద్రాలు	49
గ్రీన్ అంబాసిడర్ల సంఖ్య	1555
సేవా మిత్రల సంఖ్య	496



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం



ప్రజల నుంచి చెత్త సేకరిస్తున్న క్లాప్ మిత్రలు

అనంతపురం రూరల్: గ్రామాల అభివృద్ధి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా ప్రభుత్వం స్వచ్ఛత వైపు అడుగులు వేస్తోంది. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచి వ్యాధులు ప్రబలకుండా చూడటంతో పాటు పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చి గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తోంది. అన్ని పంచాయతీల్లో జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం ద్వారా చెత్త సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. తద్వారా చెత్తను తరలించడంతో పాటు ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపడుతుండటంతో పల్లెల్లో స్వచ్ఛ వాతావరణం నెలకొంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా చెత్త నుంచి తయారు చేసిన ఎరువును విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుండటంతో గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయి. అనంతపురం జిల్లాలో 575 పంచాయతీల్లో 518 చోట్ల చెత్త సంపద తయారీ కేంద్రాలను పూర్తి వినియోగంలోకి తెచ్చారు. మరో 49 కేంద్రాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఇళ్ల నుంచి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించడానికి జిల్లాలో 1555 మంది గ్రీన్ అంబాసిడర్లను నియమించారు. సంపద తయారీ కేంద్రాలకు వచ్చే చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా మార్చి కంపోస్టు ఎరువును తయారు చేయడానికి మరో 496 మంది సేవా మిత్రలు సంపద తయారీ కేంద్రాల్లో పని చేస్తున్నారు. జిల్లాలోని ఆయా పంచాయతీల పరిధిలో చెత్త తరలింపునకు 1175 రిక్షాలు, 147 బుస్ కట్టర్స్, 619 హైపర్ క్లీనర్స్, 39 డీజిల్ ఆటోలు, 539 ఫాగింగ్ మిషన్లు, 588 ఇన్సినేటర్స్, 11 పాలిథిన్ ష్రేడర్స్ అందుబాటులో ఉన్నాయి. మరోవైపు పారిశుధ్యాన్ని మెరుగుపరచడానికి సామాజిక శానిటరీ కాంప్లెక్స్‌లు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు.

పారిశుధ్య నిర్వహణకు పెద్ద పీట

జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం పారిశుధ్య నిర్వహణను వివిధ రూపాల్లో చేపడుతోంది. రిక్షాలు, ట్రాక్టర్లు, ఆటోల ద్వారా చెత్తను సేకరించడం ఫాగింగ్ మిషన్లు హైపర్ టాయిలెట్ క్లీనర్లతో ఎప్పటికప్పుడు గ్రామాల్లో ఫాగింగ్ చేస్తుండటంతో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నారు.. పారిశుధ్య నిర్వహణతో పాటు మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో పల్లెలు స్వచ్ఛత వైపు అడుగులేస్తున్నాయి.

గత ప్రభుత్వంలో దోపిడీ

గత టీడీపీ ప్రభుత్వ హయంలో సంపద తయారీ కేంద్రాల నిర్మాణంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయి. చాలా చోట్ల కేంద్రాలు నిర్మించకుండానే నిర్మించినట్లు రికార్డులు సృష్టించి జేబులు నింపుకున్నారు. అయితే వీటన్నింటికీ చెక్ పెట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ప్రతి గ్రామంలో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని నిర్మించి గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది.

గ్రామాల పరిశుభ్రతే లక్ష్యం



గ్రామాల పరిశుభ్రతే లక్ష్యంగా ప్రభుత్వం స్వచ్ఛ సంకల్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా అమలు చేసి గ్రామాల్లో స్వచ్ఛ వాతావారణం నెలకొల్పేందుకు కృషి చేస్తున్నాం. జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండటంతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి.

– ప్రభాకర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి

నీటి డ్రమ్ములో మహిళ మృతదేహం

గంగవరం: స్థానిక సాయినగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఇంటి వద్ద నీటి డ్రమ్ములో మహిళ మృతదేహం శుక్రవారం వెలుగు చూసింది. స్థానికుల వివరాలమేరకు... అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన లక్ష్మి (57) 13 ఏళ్లుగా పలమనేరు పరిసరాల్లో చెత్త బాటిళ్లు ఏరుకుంటూ గుండుబావి వద్ద గుజిరీ అంగడిలో విక్రయించుకుని జీవనం సాగించేది. గురువారం సాయంత్రం బాటిళ్లను విక్రయించి మొబైల్‌కు చార్జింగ్ పెట్టుకుని వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ఆమె శరీరంపై దుస్తులు లేకపోవడం, గాయాలు ఉండటంతో ఎవరో హత్య చేసి డ్రమ్ములో పడేసినట్లు పోలీసులు భావిస్తున్నారు.

విద్యార్థి అదృశ్యం



పవన్ (ఫైల్)

తాడిపత్రి అర్బన్: పట్టణానికి చెందిన ఓ బాలుడు అదృశ్యమైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు... పట్టణంలోని సంజీవనగర్ జీరో రోడ్డులో నివాసముంటున్న అరుణ ,మురళీ దంపతులకు కుమారుడు పవన్ ఉన్నాడు. స్థానిక మోడల్ పాఠశాలలో పవన్ 9వ తరగతి చదువుతున్నాడు. గురువారం పవన్‌ను తల్లి అరుణ స్కూలుకు వెళ్లి చదువుకోమని చెప్పింది. అయితే రాత్రి 8 గంటల సమయంలో పవన్ ఇంటి నుంచి తిరిగి రాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తోపుదుర్తి కుటుంబానికి ప్రజలే బలం

- మా ప్రయాణమంతా రాప్తాడు ప్రజలతోనే..
- కమీషన్లు నొక్కిన చరిత్ర పరిటాల కుటుంబానిదే..
- తప్పులు మీరు చేసి నిందలు మాపైన వేస్తారా?
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: తోపుదుర్తి కుటుంబానికి ప్రజలే బలమని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను మరోసారి రాప్తాడు నుంచే పోటీ చేసి 2024లో మళ్లీ అసెంబ్లీలోకి అడుగుపెడతానని అన్నారు. తాను పుట్టి పెరిగిన నియోజకవర్గం రాప్తాడు అని, చివరి క్షణం వరకూ ఇక్కడే ఉంటానని స్పష్టం చేశారు. తాతల నాటి కాలం నుంచి తమ ప్రయాణమంతా రాప్తాడు నియోజకవర్గ ప్రజలతోనే నన్నారు.

రూ.2,500 కోట్ల లబ్ధి

రాప్తాడు నియోజకవర్గానికి పరిటాల కుటుంబం మేఘం లాంటిదని, అలా వచ్చి ఇలా వెళ్లిపోతుందన్నారు. తాను ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురాలేకపోయానంటూ పరిటాల సునీత మాట్లాడుతున్నారని, డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రాప్తాడు నియోజకవర్గంలో దాదాపు రూ. 2,500 కోట్లు పేదల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం తమదన్నారు. 2008లో ఉచిత బోర్లు మొదలు పెట్టి దాదాపు 2 వేలు బోర్లు వేయించామని, ఎమ్మెల్యే అయిన తర్వాత కూడా దాదాపు 2 వేల ఉచిత బోర్లు వేయించామన్నారు.

ఎన్నికల్లోపు రిజర్వాయర్ పనులు

ఎన్నికల్లోపు తోపుదుర్తి రిజర్వాయర్ పనులు మొదలు పెడతామని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తెలిపారు. పేరూరు డ్యాంకు నీళ్ల తీసుకురావాలనే ఆలోచన వచ్చిన వెంటనే సీఎం జగన్ ఆశీస్సులతో ఆచరణలోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వానికి పైసా ఖర్చు లేకుండా పేరూరు డ్యాంకు నీళ్ల తీసుకురావచ్చని తాను ఎన్నోమార్లు చెప్పినా పట్టించుకోకుండా పరిటాల సునీత మంత్రిగా ఉన్న సమయంలో ఏకంగా రూ. 800 కోట్లతో టెండర్లు పిలిచి రూ. 20 కోట్లు పనులు చేసి రూ. 40 కోట్లు బిల్లులు చేసుకున్నారని విమర్శించారు. తోపుదుర్తి రిజర్వాయర్ భూసేకరణకు డబ్బులు తీసుకురాలేదని ఆరోపణలు చేస్తున్నారని, రిజర్వాయర్‌కు సంబంధించి బాధిత రైతులకు న్యాయం చేసి పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు.

కమీషన్లు నొక్కిన చరిత్ర పరిటాల కుటుంబానిదే..

రాప్తాడు నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరు తెప్పిస్తామన్నారు. మీలాగా రైతులను మోసం చేసే ఆలోచనలు తమ చరిత్రలోనే లేవన్నారు. పరిహారం ఇవ్వకుండా రైతులను మభ్యపెట్టి కాంట్రాక్టర్లతో పనులు చేయించి వారితో కమీషన్లు నొక్కిన చరిత్ర పరిటాల కుటుంబానిదేనన్నారు. ఎస్‌కేసీ కంపెనీ 2018లో రాప్తాడు నియోజకవర్గంలో 33 రోడ్ల కాంట్రాక్టులు తెచ్చుకుందని, ఎన్నికల ముందు పనులు చేస్తున్నట్లు హడావుడి చేశారే తప్ప తర్వాత పనులను నిలిపివేశారన్నారు. నేటికీ ఆ పనులు వాళ్లే చేపడుతున్నారని గుర్తు చేశారు. పనులు నిలుపుదల చేస్తే గ్రాంటు వెనక్కు పోతుందనే కారణంతో ఆ కంపెనీతోనే పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. అలాంటి మీ కంపెనీ రోడ్లు వేయకుండా తమపై బురద జల్లడం దారుణమన్నారు. తాను సబ్ కాంట్రాక్ట్‌గా చేసిన పనులకు బిల్లులు చేసుకున్న సంస్కృతి వాళ్లదేనన్నారు. రోడ్ల నిర్మాణాల్లో తప్పులు వాళ్లు చేసి నిందలు తమపై వేస్తున్నారన్నారు. పనులు పూర్తి చేసేందుకు కొంత గడువు ఇచ్చి గడువులోపు పనులు చేయకపోతే పరిటాల సునీత ఇంటి ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. రుద్రంపేట నుంచి కట్టకిందపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్ట్ తీసుకున్న సంస్థ సోమవారంలోగా పనులు మొదలు పెట్టకపోతే కాంట్రాక్టర్ ఇంటిముందు కూడా ధర్నా చేస్తామన్నారు. గ్రామాల్లో వంద రోజుల్లో వంద కిలోమీటర్ల ఇంటర్నల్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామన్నారు. ప్రసన్నాయపల్లి పంచాయతీలో ఆరు కిలోమీటర్లు, కక్కలపల్లికాలనీ, పాపంపేట పంచాయతీల్లో దాదాపు 30 కిలోమీటర్ల సీసీ రోడ్లు, మట్టిరోడ్లు, డ్రైనేజీలు వేస్తున్నామన్నారు.

జనవాక్కు

ఆర్థికంగా అండగా ఉన్నారు



ముఖ్యమంత్రి జగన్ మా కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉండి ఆర్థికంగా ఆదుకున్నారు. ప్రతి సంవత్సరం వైఎస్సార్ చేయూత డబ్బులు తీసుకుంటున్నాను. నా భర్తకు పింఛన్ వస్తోంది. మా కుటుంబం సంతోషంగా జీవిస్తున్నాము. గతంలో ఏ ప్రభుత్వంలో ఒక్క రుపాయలు కూడా మా కుటుంబానికి ఇవ్వలేదు. జగన్ సీఎం అయ్యాక అర్హతన ఉన్న ప్రతి పథకం నా కుటుంబానికి అందిందని గర్వంగా చెబుతున్నాను.

– బోయ లక్ష్మిదేవి, ఎస్సీ కాలనీ, పాల్తూరు

పాఠశాల చూడచక్కగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు ఆధునిక వసతులు సమకూరాయి. నేను పని చేస్తున్న కంబదూరు ఎస్‌డబ్ల్యూఎస్ ప్రాథమిక పాఠశాలకు మొదటి విడత నాడు–నేడు కింద ప్రభుత్వం రూ.16 లక్షలు మంజూరు చేసింది. దీంతో శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల ఇప్పుడు సరికొత్తగా మారింది. నూతన గదులు, మరుగుదొడ్లు, ప్రహరీ , నాణ్యమైన డెస్కులు, తాగునీటి కోసం మినరల్ వాటర్ ప్లాంట్, తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండటంతో అడ్మిషన్ల సంఖ్య గతంలో కన్నా పెరిగింది.

–లాలెప్ప, ఉపాధ్యాయుడు, కంబదూరు

మా జీవితాల్లో వెలుగు నింపారు



మేము వ్యవసాయ కూలీలం. నాకు భర్త రంగనాయకులు, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రెక్కాడితే గాని ఢొక్కాడని కుటుంబం మాది. అలాంటి మా జీవితాల్లో అమ్మఒడి, రైతు భరోసా పథకాలు వెలుగులు నింపాయి. కుమార్తె మహిమ స్థానిక మోడల్‌స్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. కుమారుడు రాజు సైతం అదే స్కూల్‌లో 8వ తరగతి చదవుతున్నారు. నాలుగేళ్లుగా కూతురుకు రూ.15 వేల చొప్పున అమ్మఒడి పథకం డబ్బులు వచ్చాయి. అలాగే జగనన్న గోరుముద్ద, విద్యాకానుక లాంటివి బిడ్డలిద్దరికీ వరమయ్యాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడిలో చదువు చెబుతున్నారు.అంతేకాదు మాకు 1.65 ఎకరాల భూమి ఉండగా రైతు భరోసా పథకం కింద రూ.13,500 చొప్పున వ్యవసాయ పెట్టుబడిగా ఇస్తూ సీఎం జగనన్న అండగా ఉంటున్నారు.

–ఎం ధనలక్ష్మి, పీ కొండాపురం, పామిడి

జగనన్నకు రుణపడి ఉంటాం



నేను చేనేత కార్మికుడి. నా భార్య ఆదిలక్ష్మి, నేను ఇద్దరం పనిచేస్తూనే పూట గడుస్తుంది. ముడిసరుకును సైతం తెచ్చుకోలేక చేనేత కార్మికుల జీవితం దుర్భరంగా ఉండేది. వైఎస్ జగన్ సీఎం కాగానే చేనేత కార్మికుల జీవితాలు వెలుగుమయం అయ్యాయి. చేనేత నేస్తం పథకం కింద ప్రతి ఏడాది ముడిసరుకుకు రూ.24 వేలను ప్రభుత్వం అందిస్తోంది. దీంతో మూలనపడ్డ చేనేత రంగం తిరిగి పూర్వ వైభవానికి నోచుకుంది. రూ.24 వేలు చొప్పున మా కుటుంబానికి రూ.1.20 లక్షలు లబ్ధి చేకూరింది. మా జీవితాల్లో వెలుగు నింపిన సీఎం జగన్‌కు మా కుటుంబం రుణపడి ఉంటాం.

– వై ధనుంజయ, చేనేత కార్మికుడు, పామిడి

సమస్యలు తక్షణం పరిష్కరించాలి




డీఆర్‌ఓ గాయత్రిదేవికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: ఉద్యోగుల సమస్యలను ఆయా శాఖల అధికారులు తక్షణం పరిష్కరించాలని డీఆర్‌ఓ గాయత్రిదేవి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఉద్యోగుల కోసం నిర్వహించిన ప్రత్యేక స్పందనలో డీఆర్‌ఓతో పాటు డిప్యూటీ కలెక్టర్ ఆనంద్ అర్జీలు స్వీకరించారు. స్పందనలో వివిధ సమస్యలపై 16 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం డీఆర్‌ఓ మాట్లాడుతూ స్పందన అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి అర్జీకి సరైన పరిష్కారం చూపించాలన్నారు. అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. ఒకే సమస్య పదే పదే వస్తే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో స్పందన ఇన్‌చార్జి మారుతి పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ వేధిస్తున్నారు : స్థానిక నవోదయ కాలనీలోని బాలికల గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అక్కడి విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధిస్తున్నారని దళిత గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు, గురుకుల పాఠశాల ఉద్యోగులు డీఆర్‌ఓకు ఫిర్యాదు చేశారు. డీఆర్‌ఓని వారు ఆమె చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రిన్సిపాల్ తీరును వివరించారు. విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడుతున్నారని చెప్పారు. బాలికల పాఠశాలకు మగవారిని ప్రిన్సిపాల్‌గా నియమించడం సరికాదన్నారు. డీఆర్‌ఓని కలిసిన వారిలో జేఏసీ నాయకులు సాకే హరి, నెరమెట్ల ఎల్లన్న, పాఠశాల వార్డెన్ అనురాధ, పీఈటీ లిజికుమారి, అటెండర్ నందిగౌడ్ ఉన్నారు. విచారణ చేయించి తగిన చర్యలు తీసుకుంటామని డీఆర్‌ఓ హామీ ఇచ్చారు.

విద్యుదాఘాతంతో కార్పెంటర్ మృతి



మృతుడు షేక్ షాషావలి

గుంతకల్లు రూరల్: విద్యుదాఘాతానికి గురై షేక్ షాషావలి (48) అనే కార్పెంటర్ మృతి చెందిన సంఘటన గుంతకల్లు పట్టణంలో చోటు చేసుకుంది. హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన షాషావలికి భార్య గోరీమా, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన కార్పెంటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం గుంతకల్లు పట్టణంలోని ప్రతిభా వికాస్ స్కూల్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న శ్యాంసుందర్ అనే వ్యక్తి ఇంట్లో కార్పెంటర్ పనికి వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురికావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. కసాపురం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

‘పది’లో వందశాతం ఫలితాలే లక్ష్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ నాగరాజు

బెళుగుప్ప: ‘గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ బడుల్లో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనతో పాటు డిజిటల్ బోధనతో విద్యావ్యవస్థను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వాటిని సద్వినియోగం చేసుకుని పదో తరగత విద్యార్థులు వందశాతం ఫలితాలను సాధించాలి’ అని డీఈఓ నాగరాజు పేర్కొన్నారు శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీని ఎంఈఓ మల్లారెడ్డితో కలసి పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. వందశాతం ఫలితాలే లక్ష్యంగా పంచతంత్ర, అనంత సంకల్పాన్ని అమలు చేసి విద్యార్థినులను పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. వారం పరీక్షలు, రెండు వారాల పరీక్షలు రాయిస్తూ మెరుగులు దిద్దాలని ఎస్‌ఓ నాగరత్న, పాఠశాల బోధనా సిబ్బందిని ఆదేశించారు. అనంతరం బెళుగుప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు ఎలా సంసిద్ధం కావాలో వివరించారు.

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం

- 162 మంది రైతులకు పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పెద్దారెడ్డి



భూ పట్టాలను పంపిణీ చేస్తున్న తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: పేద రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దపప్పూరు మండలంలోని అశ్వత్థం ఎస్ఎల్ఎన్నార్ కల్యాణ మండపంలో పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, తాడిపత్రి మండలాలకు చెందిన భూమిలేని 162 మంది రైతులకు 202 ఎకరాల విస్తీర్ణానికి సంబంధించి పట్టాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి మాట్లాడుతూ కొన్నేళ్లుగా భూమిని సాగు చేసుకుంటూ అనుభవంలో ఉన్న రైతులను ప్రభుత్వం గుర్తించి 8వ విడత భూమి పంపిణీ చేయాలన్న ఉద్దేశంతో సీఎం జగన్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటి వరకు భూమి సాగు చేసుకుంటున్నా ఆ భూమికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులకు భూ పంపిణీ ఆనందాన్ని చేకూర్చిందని చెప్పారు. గత ప్రభుత్వంలో కేవలం రాజకీయ పలుకుబడి ఉన్నవారికి మాత్రమే భూ పంపిణీ చేశారని విమర్శించారు. కుల,మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారికి భూ పట్టాలు పంపిణీ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు.

శ్మశాన స్థలానికి మోక్షం

తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి, ఉస్సేనాపురం గ్రామాల్లో శ్మశాన స్థలం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో పర్యటించినప్పుడు స్థానిక ప్రజలు తెలిపారు. శ్మశానానికి స్థలాన్ని ఏర్పాటు చేయాలని అప్పట్లోనే ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అందులో భాగంగా గ్రామాల్లో శ్మశాన వాటికకు సంబంధించి ఆయన పట్టాలను గ్రామస్తులకు అందజేశారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యను ఎమ్మెల్యే పరిష్కరించడంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

‘అశ్వత్థం’ అభివృద్ధికి రూ.5 లక్షలు విరాళం

అశ్వత్థ నారాయణస్వామి క్షేత్రంలో చేపట్టిన అభివృద్ధి పనులకు తన వంతు సాయంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రూ.5 లక్షల విరాళాన్ని ఆలయ చైర్మన్ చిట్టేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రమణ్యాలకు అందజేశారు. క్షేత్రంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టినా తనవంతు సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వేమనాథ్‌రెడ్డి, ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, జిల్లా పార్లమెంట్ జనరల్ సెక్రటరీ రవిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామ్మూర్తిరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు హాజీవలి, సర్పంచ్ రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలివ్వడం హర్షణీయం



కొన్నేళ్లుగా మేము ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నాము. ఆ భూమికి ఎలాంటి ఆధారాలు లేవు. 8వ విడత భూమి పంపిణీ కార్యక్రమంలో ఇప్పుడు పట్టా అందజేయం సంతోషంగా ఉంది. తమకు భూమి ఉందన్న గ్యారంటీని వైఎస్సార్ ప్రభుత్వం కల్పించింది. సీఎం జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు.

–లక్ష్మీదేవి, అత్తిరాలదిన్నె, పెద్దపప్పూరు

అర్హులందరికీ న్యాయం



పలుకుబడి ఉన్న వారికి మాత్రమే భూ పంపిణీలో పట్టాలు అందిస్తారని అనుకున్నా. కానీ ఎలాంటి రాజకీయ భేదాలు లేకుండా తాను సాగు చేస్తున్న 66 సెంట్ల విస్తీర్ణానికి ఎమ్మెల్యే పెద్దారెడ్డి భూ పట్టా అందజేయడం ఆనందంగా ఉంది. ఈ ప్రభుత్వం ఇలాగే కొనసాగితే నాలాంటి ఎంతోమంది నిరుపేద రైతులకు తప్పక న్యాయం జరుగుతుంది.

–షెక్షావలి, ముచ్చుకోట, పెద్దపప్పూరు మండలం.

క్లుప్తంగా

తపాలా ఉద్యోగుల సమ్మె

అనంతపురం సిటీ: తపాలా శాఖ అనంతపురం డివిజన్ ఉన్నతాధికారుల తీరుపై గ్రామీణ తపాలా ఉద్యోగులు (జీడీఎస్) ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి నాల్గో రోజుకు చేరుకుంది. ఏఐజీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి కృష్ణయ్య, ఎన్‌యూజీడీఎస్ డివిజన్ కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడారు. సమ్మెను విరమించి వెంటనే విధుల్లో చేరాలని, లేకపోతే ఉద్యోగాలు ఊడతాయ్ అంటూ డివిజన్ వ్యాప్తంగా సుమారు 500 మంది ఉద్యోగులకు వాట్సాప్‌లో సంక్షిప్త సందేశాలను డివిజన్ ఉన్నతాధికారులు పంపడాన్ని వారు తప్పుబట్టారు. సమ్మెలో యూనియన్ల ప్రతినిధులు అరుణ, చాంద్‌బాష, రమణారెడ్డి, నాగార్జున, నాగభూషణం, సత్యనారాయణ, బాలకృష్ణ, టోపీసాబ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఎంపికైన భువనేశ్వర్



ప్రశంసలు అందుకుంటున్న భువనేశ్వర్

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన బాల కళాకారుడు భువనేశ్వర్ జాతీయ స్థాయి నృత్యోత్సవాలకు ఎంపికయ్యాడు. విజయవాడలో రెండు రోజులుగా ఎస్‌ఈఆర్‌టీ ఆధ్వర్యంలో జరుగుతున్న కళాఉత్సవ్‌లో అనంత నాట్యాచార్యుడు విజయ్‌కుమార్ శిష్యుడు భువనేశ్వర్ కూచిపూడి నాట్యంలో అద్భుత అభినయాన్ని ప్రదర్శించి, రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని దక్కించుకొని ఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాపరెడ్డి, ఐఏఎస్ శ్రీనివాసులు చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నాడు. వచ్చేనెల 9,10 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు.

హజ్ యాత్రపై 17న అవగాహన

అనంతపురం కల్చరల్: అరవిందనగర్‌లోని మామూర్ మసీదులో ఈనెల 17న హజ్‌యాత్రపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హజ్ కమిటీ కన్వీనర్ ముస్తాక్ మౌలానా బాఖవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పారిశ్రామిక వేత్తలుగా ఎదగండి




వీసీ రంగజనార్ధనను సన్మానిస్తున్న ఎంబీఏ విభాగాధిపతి, అధ్యాపకులు

అనంతపురం:విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి, మరికొంత మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలని జేఎన్‌టీయూ(ఏ) వైస్ చాన్సలర్ రంగజనార్ధన తెలిపారు. శుక్రవారం స్థానిక జేఎన్‌టీయూలోని అనంత స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఎంబీఏ విభాగం) ఆధ్వర్యంలో ఏర్పాట చేసిన ప్రత్యేక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆ తరువాత తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఎంబీఏ కోర్సుకు ఉన్న ప్రాధాన్యత, ఉద్యోగావకాశాలపై ఆయన వివరించారు. నవకల్పన ఆలోచనలు, క్షేత్ర అధ్యయనాలు, అందులో ఎంబీఏ విద్యార్థులకు ఉన్న అవకాశాలపై రిజిస్ట్రార్ శశిధర్ వివరించారు. స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి నారాయణరెడ్డి ఎంబీఏ విభాగంలోని కోర్సులు, వసతులు తదితర అంశాలపై తెలిపారు. వీసీ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణక్రాంతి, పీఆర్‌ఓ డాక్టర్ రామశేఖరరెడ్డి, ఎంబీఏ బోధన, బోధనేతర సిబ్బంది హాజరయ్యారు.

పలు గ్రామాల మార్పు

శింగనమల: నియోజకవర్గంలోని బుక్కరాయసముద్రం మండలం పి.కొత్తపల్లి, పసులూరు, నార్పల మండలం దుర్గం గ్రామాలను ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి నుంచి మారుస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. పి.కొత్తపల్లి, పసులూరు, దుర్గం గ్రామాలు ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండేవి. ప్రజలు సమస్యను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి దృష్టి తీసుకొచ్చారు. స్పందించిన వారు ఉన్నతాధికారులతో మాట్లాడి పోలీస్‌స్టేషన్ల పరిధిని మార్పించారు.

స్టాఫ్‌నర్సు ఔదార్యం



సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావుకు వీల్‌చైర్లను అందజేస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సీనియర్ స్టాఫ్‌నర్సు మాబున్నీ తన అన్న జ్ఞాపకార్థం క్యాజువాలిటీ, లేబర్ వార్డుకు రెండు వీల్‌చైర్లను అందించింది. శుక్రవారం గ్రేడ్ -1 నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు, స్టాఫ్‌నర్సు మబున్నీలు వీల్‌చైర్లను సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావుకు అందించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

అనంతపురం కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని నగర ప్రజలకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని 65వ సచివాలయ పరిధిలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే.. సంక్షేమ, అభివృద్ధి బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు మంచి జరిగితే ఓర్వలేని ప్రతిపక్షాలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. చంద్రబాబు నాయుడు సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్నా ప్రజలకు చేసిన మంచి ఏమీ లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని అందించారన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా పారదర్శకంగా పాలన సాగుతోందన్నారు. తమ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేశారన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యాన్ని చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు.

రూ.300 కోట్లతో ఆస్పత్రి బలోపేతం:

రూ.300 కోట్లతో అభివృద్ధి పనులతో ప్రభుత్వ సర్వజనాస్పత్రిని బలోపేతం చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. జిల్లా కేంద్రంలో సర్జికల్, ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటయ్యాక రోగులు, గర్భిణులు , బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. ఈ నెల 18 నుంచి రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచనున్నట్లు తెలిపారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. 68వ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్లు టీవీ చంద్రమోహన్ రెడ్డి, శేఖర్‌బాబు, నగర నేత చింతా సోమశేఖర్ రెడ్డి, క్లస్టర్ అధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్ తదితరులు సంక్షేమ, అభివృద్ధి బోర్డులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వీరా రామకృష్ణా రెడ్డి, కార్పొరేటర్లు రాజేశ్వరి, శ్రీనివాసులు, నాయకులు అనిల్‌కుమార్‌గౌడ్, దాదాఖలందర్, రామచంద్ర, రవి, వెంకటస్వామి, సచివాలయ కన్వీనర్లు వేణుగోపాల్, సురేష్, పాల్గొన్నారు.

పేదలంతా వైఎస్ జగన్ వెంటే

రాప్తాడురూరల్: పేదలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని అనంతపురం రూరల్ ఎంపీపీ వరలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, పార్టీ మండల కన్వీనర్ కె.రాధమ్మ, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనుంజయాదవ్ తెలిపారు. శుక్రవారం అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయ పరిధిలో లబ్ధిదారులు ఇప్పటిదాకా వివిధ పథకాల ద్వారా రూ. 23, 59,13,374 లబ్ధి పొందారన్నారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కె.లక్ష్మీ, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నాగరాజు, నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పథకాల బ్రోచర్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ముందుకెళ్దాం



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ వసీం తదితరులు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించిన జేఎన్‌టీయూ వీసీ రంగజనార్ధన, అధ్యాపకులు



చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ, సిబ్బంది

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలలోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి మేయర్ వసీం ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులర్పించారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు అబూ సలేహ, కమల్‌భూషణ్, ఈఈ సూర్యనారాయణ, డీఈ ద్రాక్షాయని, మేనేజర్ లక్ష్మిదేవి పాల్గొన్నారు.

అనంతపురం: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలను జేఎన్‌టీయూలోని పరిపాలన భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూఏ వీసీ రంగజనార్ధన, రిజిస్ట్రార్ శశిధర్, డైరెక్టర్లు కేశవరెడ్డి, ఈశ్వరరెడ్డి, కిరణ్మయి, ప్రిన్సిపల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణ కాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

రాప్తాడురూరల్: అమరజీవి పొట్టిశ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి వేడుకలను సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జె. వరప్రసాదరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఎఫ్ఏఓ హరిప్రియ, సూపరింటెంట్ సునీల్‌కుమార్, సీఎంఓ గోపాలకృష్ణయ్య, జీసీడీఓ మహేశ్వరి, ఏఎస్ఓ గురుమునికృష్ణ, అసిస్టెంట్ ఏఎంఓ చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

అనంతపురం కల్చరల్: నగరంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యదర్శి కలువల సతీష్, జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బలబద్ర మనోజ్, అదనపు కార్యదర్శి సత్రసాల మంజునాథ్, మాజీ అధ్యక్షుడు కల్లూరు నాగరాజు పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆవోపా అధ్యక్షుడు జయంతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాముల కృషిని గుర్తు చేసుకున్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల్లో పలువురికి చోటు

కనగానపల్లి: వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగ కమిటీల్లో రాప్తాడు నియోజకవర్గం నుంచి పలువురికి చోటు కల్పించారు. శుక్రవారం సాయంత్రం పార్టీ కేంద్రం కార్యాలయం పార్టీ మహిళా, మైనార్టీ, ఎస్సీ సెల్ కమిటీలను ప్రకటించింది. రాప్తాడు నుంచి మహిళా విభాగంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనుసూయమ్మ, కార్యదర్శులు సరస్వతి, రెడ్డమ్మ, రత్నమ్మ, సహాయ కార్యదర్శులుగా బి.నాగమ్మ, ఎం. వెంకటలక్ష్మిని ఎంపిక చేశారు. జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ మునాఫ్, ఎస్సీసెల్ కార్యదర్శిగా ఎనమల మహేష్, వైఎస్సార్‌టీయూసీ ఉపాధ్యక్షుడిగా పవన్‌కుమార్‌ను ఎంపిక చేశారు.

అయ్యప్ప పూజలు ప్రారంభం

అనంతపురం కల్చరల్: మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పడిపూజ నిర్వాహకులు లక్ష్మీరెడ్డి, శ్రీనివాసులు మాట్లాడుతూ శనివారం 36 కలశాలతో పెద్ద ఎత్తున సాగే పడిపూజను విశాఖపట్నం గురుస్వామి రేపల్లె శివశంకరరావు ప్రారంభిస్తారన్నారు. ఈనెల 20 వరకు బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతాయన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వినియోగిద్దాం



విద్యార్థులకు మెమెంటోలను అందిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

అనంతపురం టౌన్: విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకుందామని విద్యుత్ శాఖ ఈఈ జేవీ రమేష్ అన్నారు. శుక్రవారం ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా అనంతపురం రూరల్ మండలం తపోవనం జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంధనాన్ని పొదుపుగా వినియోగించుకుంటే భవిష్యత్ తరాలకు ప్రయోజనం చేకూర్చినవారమవుతామన్నారు. విద్యుత్ అవసరం ఉన్నప్పుడు మాత్రమే వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏడీలు వివేకానంద, లక్ష్మీ నారాయణ, ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లను తెరిచిన అధికారులు



రాప్తాడులో అంగన్‌వాడీ కేంద్రం తలుపులు తెరుస్తున్న అధికారులు



రాప్తాడులో అంగన్‌వాడీ చిన్నారులకు భోజనం ఏర్పాటు చేసిన సచివాలయ సిబ్బంది

రాప్తాడు: మండలంలోని 44 అంగన్‌వాడీ సెంటర్లను మండల అధికారులు శుక్రవారం తెరిచారు. కేంద్రాల్లో ఏ సరుకులు ఉన్నాయో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి, గ్రామ సచివాలయ, డ్వాక్రా మహిళలకు అప్పగించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 12 నుంచి సమ్మెలోకి వెళ్లిన విషయం విదితమే. నాలుగు రోజుల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు మూత పడడంతో చిన్నారులు ఎవరూ ఇబ్బందులు పడకూడదని సీఎం జగన్‌మోహన్ రెడ్డి గొప్ప నిర్ణయాన్ని తీసుకున్నారు. ఎంపీడీఓ సాల్మన్, ఎంఈఓ మల్లికార్జున, ఏపీఎం శివకుమార్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత, సచివాలయ ఉద్యోగులు అంగన్ వాడీ కేంద్రాల తాళాలు ధ్వంసం చేసి, తలుపులు తెరిచారు. సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు చిన్నారులు భోజనాలు చేసి, వడ్డించారు. ఎంపీడీఓ సాల్మన్ మాట్లాడుతూ మండలంలోని 44 అంగన్‌వాడీ కేంద్రాల తలుపులు తెరిచామన్నారు. ఆయా కేంద్రాలు సరుకులు, రిజిష్టర్లు ఏమీ ఉన్నాయో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెలోకి వెళ్లినా అంగన్‌వాడీ కేంద్రాలు యధావిధిగా పనిచేస్తాయని తెలిపారు.

సర్వజనాస్పత్రిలో షార్ట్ సర్క్యూట్



ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌లో షార్ట్ సర్క్యూట్ కావడంతో కిటికీలో నుంచి వస్తున్న పొగ



చీకట్లో ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌లో శుక్రవారం షార్ట్ సర్క్యూట్ జరిగింది. థియేటర్‌లోని ఆటో క్లేవ్ ఉన్న స్విచ్‌బోర్డు నుంచి మంటలు చెలరేగాయి. దీంతో ఆపరేషన్ థియేటర్‌ను పొగ కమ్మేసింది. ఒక్కసారిగా వైద్యులు, సిబ్బంది, గర్భిణులు, బాలింతలు భయాందోళన చెందారు. స్థానికులు డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలతకు సమాచారం అందించారు. దీంతో వారు స్పందించి సెక్యూరిటీ, ఎలక్ట్రీషియన్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. సకాలంలో స్పందించి ఆ విభాగానికి కరెంటు సరఫరా లేకుండా చర్యలు తీసుకున్నారు. షార్ట్ సర్క్యూట్ జరిగే కొద్ది సమయానికి ముందే ఓ గర్భిణి ప్రసవమైంది. అయితే అదృష్టవశాత్తూ ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత ఘటన స్థలాన్ని పరిశీలించారు.

మల్బరీ సాగుతోనే అధిక దిగుబడి



మల్బరీ పంటపై రైతులకు అవగాహన కల్పిస్తున్న పట్టుపరిశ్రమ శాఖ జిల్లా అధికారి అంజనేయులు

రాప్తాడు: మల్బరీ పంట సాగు చేసి, రైతులు అధిక దిగుబడి సాధించాలని పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి డి.అంజనేయులు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎం.బండమీదపల్లిలో మల్బరీ పంటపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో చాలా మంది రైతులు వేరుశనగ, టమాట, దోస, వరి పంటలను సాగుచేసి, నష్టపోతున్నారన్నారు. మల్బరీ తోటలు సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం సబ్సిడీలు మంజూరు చేస్తోందన్నారు. ఎకరా మల్బరీ సాగుకు బీసీ, ఓసీ రైతులకు రూ.18,750, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.22,500, రీరింగ్ షెడ్డు నిర్మాణానికి బీసీ, ఓసీలకు రూ.3 లక్షలు, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.3.60 లక్షలు, 5 ఎకరాల్లో భూమి ఉన్న రైతులకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.3.15 లక్షలు, రీరింగ్ షెడ్ పరికరాలకు రూ.37,500 సబ్సిడీ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచు ఉమాదేవి, పట్టు పరిశ్రమశాఖ ఉద్యోగులు రామలింగారెడ్డి, ఓబులేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల నియామకం

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చెందిన నాయకులకు అనుబంధ విభాగాల కమిటీల్లో వివిధ హోదాల్లో నియమించారు. అందుకు సంబంధించి పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

బీసీ సెల్ జిల్లా విభాగం: ఉపాధ్యక్షుడిగా ఎం. వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శులు ఎం.గంగాధర్, దేవాంగ రామయ్య, కార్యదర్శిగా సంగాల లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శులుగా బి.రమణ, బసవరాజు

జిల్లా సాంస్కృతిక విభాగం: ప్రధాన కార్యదర్శిగా తరిమెల రాజు, కార్యదర్శులుగా కంబగిరి, జె.వన్నూరప్ప, సహాయ కార్యదర్శులుగా ఎస్. నిర్మల, జె.బాలరాజు,

జిల్లా ఐటీ విభాగం: ప్రధాన కార్యదర్శిగా ఎల్.నరసింహారెడ్డి, కార్యదర్శిగా టి.శ్రీకాంత్, సహాయ కార్యదర్శిగా ఎన్.మురళీధర్‌రెడ్డి

జిల్లా మహిళా విభాగం: అధ్యక్షురాలిగా బిందెల శ్రీదేవి, ఉపాధ్యక్షురాలిగా రాధ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా జి.సుజాత, కార్యదర్శిగా ఎన్.అబీబా, సహాయ కార్యదర్శిగా యు.సుమిత్ర

జిల్లా మైనార్టీ సెల్ విభాగం: అధ్యక్షుడిగా సైపుల్లా బేగ్, ప్రధాన కార్యదర్శిగా మన్సూర్ బాషా, కార్యదర్శులుగా షేక్ ఖాజా, కె.మహబూబ్ బాషా, సహాయ కార్యదర్శిగా మహ్మద్ బుడేన్ సాహెబ్

జిల్లా పంచాయతీరాజ్ విభాగం: ప్రధాన కార్యదర్శి డి.హుస్సేన్, కార్యదర్శిగా షేక్ బాబాబషీరుద్దీన్, సహాయ కార్యదర్శులుగా బి.నాగేంద్ర, డి.జాఫర్

జిల్లా ప్రచార విభాగం: ప్రధాన కార్యదర్శిగా తానీషా, కార్యదర్శిగా ఎస్.మహ్మద్ రఫీ, సహాయ కార్యదర్శులుగా హిదాయతుల్లా, ఎం.విజయకుమార్

జిల్లా రైతు విభాగం: ప్రధాన కార్యదర్శిగా రామసుబ్బారెడ్డి, కార్యదర్శిగా ఎం.జయప్రకాష్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా షేక్‌బాషా, డి.మాబుల్లు

జిల్లా ఎస్సీ సెల్ విభాగం: జిల్లా అధ్యక్షుడిగా ఎగ్గుల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శులుగా సాకే కుళ్లాయిస్వామి, మిద్దె నగేష్, కార్యదర్శులుగా కాసీ రాయచూర్ సురేష్, నీలూరు సురేష్, సహాయ కార్యదర్శులుగా కె.సులోచనమ్మ, ఎల్.లక్ష్మీనారాయణ, పుట్లూరు ప్రభాకర్

జిల్లా ఎస్టీ సెల్ విభాగం: జిల్లా ఉపాధ్యక్షులుగా సాకే పోతులయ్య, ప్రధాన కార్యదర్శిగా వై.ఈరన్న, కార్యదర్శిగా ఎస్.చంద్ర నాయక్, సహాయ కార్యదర్శులుగా వెంకట్రాముడు, నాగార్జున

జిల్లా విద్యార్థి విభాగం: జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.విజయ్‌కుమార్, కార్యదర్శిగా నవీన్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా మహ్మద్ సుల్తాన్ మొహిద్దీన్ ఆదామ్, కె.వెంకట సుబ్బారావు

జిల్లా వాణిజ్య విభాగం: ప్రధాన కార్యదర్శిగా జి.రాయపరెడ్డి, కార్యదర్శులుగా గోపా మధుసూదన్, కలవల సతీష్, సహాయ కార్యదర్శులు బి.సుబ్రమణ్యం, వి.శ్యామ్ ప్రసాద్

జిలా వికలాంగుల విభాగం: ఉపాధ్యక్షులుగా సి.రాజు, కార్యదర్శిగా సాకే అఖిల్, సహాయ కార్యదర్శులుగా జి.కిరణ్, సీబీ కిరణ్

జిల్లా చేనేత విభాగం: ప్రధాన కార్యదర్శిగా పార్వతి, కార్యదర్శి పి.మారుతీప్రసాద్, సహాయ కార్యదర్శిగా టి.వెంకట్, పి.జగదీష్

జిల్లా యువజన విభాగం: జిల్లా అధ్యక్షులుగా ఉమ్మడి మధన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా దాదా ఖలందర్, ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్ గౌడ్, కార్యదర్శిగా ఎస్. మహ్మద్ రఫీవుద్దీన్, సహాయ కార్యదర్శులుగా బి.నరసింహారెడ్డి, రాచకుళ్లాయప్ప, హేమ కిరణ్

జిల్లా సేవాదళ్ విభాగం: ప్రధాన కార్యదర్శిగా కురుబ చంద్రశేఖర్, కార్యదర్శులుగా కాలవపల్లి రాజారెడ్డి, యం.మల్లికార్జునరెడ్డి, సహాయ కార్యదర్శులుగా జి. చంద్రశేఖర్, ఆర్.మల్లేష్

వైఎస్సార్ ట్రేడ్ యూనియన్: జిల్లా అధ్యక్షుడిగా కొర్రపాడు హుస్సేన్ పీరా, ప్రధాన కార్యదర్శులుగా టి.గౌస్‌పీరా, యం. విశ్వనాథ్‌రెడ్డి, కార్యదర్శిగా పట్నం రామాంజనేయులు, పి.పుల్లారెడ్డి, వి.బలరామరావు, సహాయ కార్యదర్శులుగా దాసరి గంపయ్య, కనకరాంలను నియమించారు.

కృత్రిమ కాలు వితరణ



లక్ష్మీనాయుడుకు కృత్రిమ కాలు అందించిన తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: అమ్మ సంస్థ వ్యవస్థాపకుడు తరిమెల రమణారెడ్డి దాతృత్వంతో ఓ అభాగ్యుడికి అండగా నిలిచారు. నగరంలోని రాణీ నగర్‌కు చెందిన లక్ష్మీనాయుడు, సుభద్రమ్మ దంపతులు పాలు అమ్ముతూ జీవిస్తున్నా రు. లక్ష్మీనాయుడికి షుగర్ వ్యాధి ఉండడంతో ఓ కాలు తొలగించాల్సి వచ్చింది. నిరుపేద కుటుంబం కావడంతో ఆపన్న హస్తం కోసం ఎదురు చూశారు. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ తరిమెల రమణారెడ్డి మానవత్వంతో స్పందించి శుక్రవారం ఆ కుటుంబానికి రూ.75 వేలు ఆర్థిక సాయం అందించారు. లక్ష్మీనాయుడుకు కృత్రిమ కాలు (పార్టియన్ ఫుట్ ప్రొసెసివ్ లెగ్) అమర్చారు.

అవయవదానంపై అవగాహన

అనంతపురం: అవయవదానంపై ప్రతి ఒక్కరూ కనీస అవగాహన కలిగి ఉండాలని కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగానికి చెందిన డాక్టర్ వీఎల్‌వీఎస్ నరేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అవయవదానంపై ఉన్న అపోహలను తొలుత తొలగించాలని కోరారు. అనంతరం అవయవదానంపై వీడియోను ప్రదర్శించారు. నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ ద్వారా అవయవదానం కోసం నమోదు చేసుకునే విధానాన్ని వివరించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ గురజాడ, డాక్టర్ శ్రేయ, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ ప్రతిష్ట పెంచేలా పనిచేయాలి



కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు పోలీసులు ఎలా స్పందించాలో బుక్కరాయసముద్రం ఘటన అద్దం పడుతుందని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. బుక్కరాయసముద్రం సమీపంలోని దేవరకొండపై నుంచి కింద పడి ఆత్మహత్యాయత్నం చేసి గాయాలపాలైన వ్యక్తిని కాపాడిన సిబ్బందిని జిల్లా ఎస్పీ సన్మానించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌కు పిలిపించి, అభినందించారు. నగదు రివార్డు, జ్ఞాపికలు అందజేశారు. అనంతపురం రూరల్ మండలం కందుకూరుకు చెందిన రమేష్‌బాబు కుటుంబ కలహాలతో గురువారం దేవరకొండపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. తీవ్రంగా గాయపడ్డాడు. బుక్కరాయసముద్రం బ్లూకోల్ట్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, హోంగార్డు వీరనారప్ప వెళ్లి కొండ పై ముళ్ల పొదల్లో గాయాలతో పడి ఉన్న రమేష్ బాబును భుజాలపై కిందకు మోసుకొచ్చారు. వెంటనే అంబులెన్స్‌లో ఎక్కించి, సకాలంలో ఆస్పత్రిలో చేర్పించి రమేష్ బాబు ప్రాణాలు కాపాడారు. దీంతో జిల్లా ఎస్పీ వీరిద్దరినీ సన్మానించారు. ప్రతి ఒక్కరూ ఇదే స్ఫూర్తితో పనిచేసి పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచాలని సూచించారు.

క్యాంపస్ సెలక్షన్‌లో ఏడుగురి ఎంపిక

అనంతపురం: జేఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్‌ఈ విభాగానికి చెందిన ఏడుగురు విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్‌లో ఎంపికయినట్లు ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన శుక్రవారం తెలిపారు. వారంతా హైదరాబాద్‌లోని ఫ్యాక్ట్‌సెట్స్ (యూఎస్ బేస్డ్)కంపెనీకి ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారిలో జి.ఐశ్వర్య రెడ్డి, శ్రీసాయి రక్ష కళ, ఎస్.సార్థక్, అర్చనా గౌతం, బండి పవన్, వనం సాహితీసాయి, ఎంసీ నితిన్ ఉన్నట్లు తెలిపారు. వారికి అభినందనలు తెలిపారు.

ఒకరికి కారుణ్య నియామకం : జేఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ కళాశాలలో టెలీ మెకానిక్‌గా పని చేస్తూ మరణించిన ఆర్.సుందర్‌సింగ్ భార్య కవితకు కారుణ్య నియామకం కింద అటెండర్ ఉద్యోగం ఇచ్చినట్లు వీసీ రంగజనార్ధన తెలిపారు. ఆమెకు శుక్రవారం నియామక పత్రాన్ని అందించారు.

రేపు అంకే శ్రీనివాస్ పుస్తకాల ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్: ఆంధ్రభారతి, స్పందన అనంత కవుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో యువకవి డాక్టర్ అంకే శ్రీనివాస్ రచించిన పుస్తకాల ఆవిష్కరణ ఉంటుందని అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఆర్ట్స్ కళాశాలలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.